క్లుప్తంగా

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేద్దాం



అడ్డాకుల: వచ్చే ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓట్లేసి గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేద్దామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమునుగల్‌ఛేడ్, పెద్దమునుగల్‌ఛేడ్, కన్మనూర్, బలీదుపల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి ఆయన ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయ మాటలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో అడ్డాకుల జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, పెద్దమందడి మండల పార్టీ అధ్యక్షుడు వేణుయాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

పోలీసుల కవాతు

మిడ్జిల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం వెలుగొమ్ములలో ప్రత్యేక పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం

జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలో బహుజనుల అభివృద్ధే లక్ష్యంగా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున ఎన్నికల బరిలో నిలిచినట్లు అభ్యర్థి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు బీసీలను మోసం చేశాయన్నారు. బహుజనులకోసం పోరాడుతున్న తనను గెలిపించాలని కోరారు.

మాయ మాటలు నమ్మవద్దు

గండేడ్: కాంగ్రెస్ మాయ మాటలు నమ్మవద్దని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని గండేడ్, రంగారెడ్డిపల్లి, జక్లపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీ, సమోస, పూరి చేయడంతో పాటు పిండి మరపట్టి ఆకట్టుకున్నారు. ఎంపీపీ మాధవి, యమునమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నిరుద్యోగ జేఏసీ యువత అడ్డగింత

మిడ్జిల్: మండల కేంద్రంలో బుధవారం పాలమూరు యూనివర్సిటీ, నిరుద్యోగ జేఏసీ విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను పంచుతుండగా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుని వాటిని తగులబెట్టారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడికి రాగా.. ఇరువర్గాల మధ్య మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ ఉన్నారు.

పప్పు దినుసుల సాగు లాభదాయకం

మహబూబ్‌నగర్ రూరల్: పప్పు దినుసుల సాగు లాభదాయకంగా ఉంటుందని జాతీయ ఆహార భద్రత పథకం టెక్నికల్ అధికారి జి.రామకృష్ణగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతన్‌పల్లిలో రైతు మొగిలయ్య సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పప్పు దినుసుల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు సుప్రియ, గాయత్రీ ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. విద్యార్థినులను బుధవారం కళాశాల వద్ద నిర్వహించిన సమావేశంలో సన్మానించారు. అధ్యాపకులు చరణ్, సృగ్నేష్, కరన్‌జీ, అఖ్తర్, నవీన, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

చిన్నచింతకుంట: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అప్రవా ఎనర్జీ బాలవికాస్ వరంగల్ స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో రూ. 11 లక్షల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మాణానికి బుధవారం ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ భూమిపూజ చేశారు. పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సంస్థ ప్రతినిధులు ప్రాన్సిస్ రెడ్డి, మురళీ, కిరణ్, పాఠశాల ఎస్‌ఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలోర్యాలీ

సాక్షినెట్‌వర్క్: కాంగ్రెస్ అభ్యర్థి జి. మధుసూదన్‌రెడ్డి బుధవారం దేవకద్ర మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, విజయసారథి రెడ్డి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో నాయకులు భారీగా పార్టీలో చేరారు.

చెరువులన్నీ నింపుతాం



కిష్టంపల్లిలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కిద్వాయిపేటలో మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

హన్వాడ /జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు–రంగారెడ్డి ద్వారా మండలంలోని చెరువులన్నీ నింపి సాగునీరు అందిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం హన్వాడ మండలంలోని గొండ్యాల్, కిష్టంపల్లి, కిష్టంపల్లిగేట్ తండా, ఎర్రగట్టుతండాల్లో ప్రచారం నిర్వహించారు. గతంలో తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు లేక పొలాలన్నీ బీడ్లుగా మారి ఏడారుల్ని తలపించాయని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణలో ప్రాజెక్టులు నిర్మించి పొలాలన్నీ పచ్చగా మారేలా చేశామన్నారు. ఆయా గ్రామాల్లో మంత్రికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ బాల్‌రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపల్లి గేట్‌తండాకు చెందిన పలువురు నాయకులు ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా.. తిరిగి బుధవారం మంత్రి సమక్షం లో పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరి తప్పుచేశామని బోయిని అంజి, రవీందర్, వెంకటయ్య, గోపాల్, మేఘ్యనాయక్, లక్ష్మన్‌నాయక్, బుడ్డ నాయక్ మంత్రి వద్ద పేర్కొన్నారు. వీరితో పాటు మరో 30మంది బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచ్ లక్ష్మి, మాజీ సర్పంచ్ సరోజ, గోపాల్, నాగేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రలోని బీఈడీ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్‌తో కలిసి నడిచారు. అనంతరం స్థానికులతో పాటు కొద్దిసేపు క్రికెట్ ఆడారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు 46, 47వ వార్డుల పరిధిలో ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా కేంద్రం శివారులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి జేఎన్‌టీయూసీ క్యాంపస్‌ను సుమారు వంద ఎకరాల్లో నిర్మిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిని దివిటిపల్లి వరకు విస్తరిస్తామన్నారు. భవిష్యత్‌లో భూత్పూర్, జడ్చర్లతో కలిపి గ్రేటర్ మహబూబ్‌నగర్‌గా మారుస్తామన్నారు. జిల్లా స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కౌన్సిలర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో ధర్మపూర్ మాజీ సర్పంచ్ వసంత, మాజీ ఎంపీటీసీ చంద్రుడు, హోటల్ లక్ష్మయ్య మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది



ఓటు అభ్యర్థిస్తున్న మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సొమ్ము కేంద్రానిది.. సోకేమో రాష్ట్రానిదన్నట్టు బీఆర్‌ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని బీజేపీ అభ్యర్థి ఎ.పి.మిథున్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎనుగొండ–వివేకానందనగర్, పోచమ్మకాలనీ, ఎస్సీ కాలనీ, అంబేద్కర్‌చౌరస్తా, వీరన్నపేట తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ఇతర పనులకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు స్థానిక పద్మావతీ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ కౌన్సిలర్లు ఎ.అంజయ్య, కొల్లె చెన్నవీరయ్య తదితరులు పాల్గొన్నారు.



మిథున్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

అభివృద్ధి వైపే జనం



కొల్లంపల్లిలో యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: సీఎం కేసీఆర్ నేతృత్వంలో గత తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమపథకాలు...అభివృద్ధి వైపే జనం చూస్తున్నరని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన వారిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బోయిన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మూడోసారి సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి అమడదూరంలో ఉన్న నారాయణపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. మరోసారి గెలిపిస్తే నారాయణపేట మండలంలో మరో మండలాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నారాయణపేట మండలానికి సాగునీరు అందించే బాధ్యత తనదేనన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి పోయే వారిని నమ్మి మోసపోవద్దని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కొల్లపంల్లి, మరికల్, బైరంకొండ, బోయిన్‌పల్లి, ఉద్మల్ గిద్ద తదితర గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు భారీ ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని అన్నారు. తమను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



బోయిన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కారును గెలిపిస్తేనే మరింత అభివృద్ధి

దామరగిద్ద: కారుగుర్తుకు ఓటేసి గెలిపిస్తేనే మరింత అభివృద్ధి సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. బుధవారం దామరగిద్దలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాటలు నమ్మొద్దన్నారు. మాజీ జెడ్పీటీసీ వెంకటమ్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ చైర్ పర్సన్ భాస్కర కుమారి, స్థానిక సర్పంచ్ ఆశమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, మాజీ ఎంపీపీ సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్ రెడ్డి గెలిపించండి

మరికల్: మండలంలోని వివిధగ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. మండల అధ్యక్షుడు తిరుపతయ్య వెంకటయ్య, సోమయ్య, మైబు, రాజులయ్య, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

హన్వాడ: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుద్దారంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆగారం చెన్నయ్య, వెంకటమ్మల కుటుంబీకులను పరామర్శించారు. మృతదేహాల వద్ద నివాళి అర్పించారు. సర్పంచ్ చెన్నయ్య ఉన్నారు.

అందుబాటులో ఉంటా

సాక్షినెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీ ద్వారానే ప్రజా సంక్షేమం సాధ్యమని అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. అందరికి అందుబాటులో ఉండి పనిచేస్తానని తెలిపారు. యెన్నంకు తీన్మార్ మల్లన్న టీమ్ మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు రవి తెలిపారు. హన్వాడ మండలంలోని సల్లోనిపల్లి, హన్వాడ, నాయినోనిపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపి నాయకులు, కార్యకర్తలు బుధవారం యెన్నం ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, రాములుయాదవ్, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

క్రిస్టల్ ఈవెంట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో బుధవారం క్రిస్టల్ ఈవెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీయూ కంట్రోలర్ రాజ్‌కుమార్ హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ రాములు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రాక్నీజాయిస్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో స్వేచ్ఛలేదు



మాట్లాడుతున్న ఏపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు: నియోజకవర్గంలో అసెంబ్లీ రౌడీ సినిమాలో రౌడీపేరుతో దుకాణాలు ఏర్పాటు చేసినట్లు ఇక్కడ కూడా ప్రతి దుకాణంలో మంత్రి ఫొటోలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, టీ దుకాణం దగ్గర నలుగురు స్నేహితులు కలిసి స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితి లేకుండాపోయిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాలమూరులో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అనేక పనులకు కేంద్రమే నిధులు ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. డబుల్ బెడ్‌రూంలు కేవలం అనుచరులకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. పాలమూరు ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి ఏం గ్యారెంటీ ఇస్తాడో చెప్పాలన్నారు. మిథున్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి ఈనెల 17న బండి సంజయ్ బొక్కలోనిపల్లి, ధర్మపూర్ మధ్యలో ఏర్పాటు చేసే కార్నర్ మీటింగ్‌కు హాజరవుతారన్నారు. అనంతరం ర్యాలీ, క్లాక్‌టవర్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. అంజయ్య, సురేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేశారు



మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ వచ్చిందని.. మూడోసారి అధికారం కోసం మరోసారి సెంటిమెంట్‌తో రెచ్చగొట్టాలని ప్రణాళికలు వేస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. బుధవారం లోకిరేవు, లింగంపల్లి, ఊరంచుతాండ, రేకులచౌడాపూర్, దేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ కుటుంబం, బీఆర్‌ఎస్ బడా నేతలే బాగుపడ్డారని విమర్శించారు. అవినీతి సర్కార్‌ను ఇంటికి పంపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుపరిపాలన అందిస్తామని తెలిపారు. ప్రజల ధనం లాకున్న వారిని చట్టపరంగా శిక్షిస్తామని వివరించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రంగారావు, జిల్లా అధికారప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, బంగ్లరవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, వెంకటేష్‌గౌడ్ ఆంజనేయులు, కుమార్, సురేష్, రాజశేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మవద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: గత ప్రభుత్వాలు తండాలను పట్టించుకోలేదని, తెలంగాణ వచ్చిన తర్వాత తండాలను గ్రామ పంచాయతీలను చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చౌలతండా, భట్టుపల్లి, భట్టుపల్లితండా, ఎల్కిచర్ల, మద్దిగట్ల గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మవద్దని అన్నారు. మరోసారి తమను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. సీఎం కేసీఆర్ కృషితో ముదిరాజ్‌లకు గుర్తింపు సాధ్యమైందని, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం భూత్పూర్‌లో జరిగిన సమావేశం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో ముదిరాజ్‌లు భారీసంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, సర్పంచులు కదిరె ప్రియాంక, ఆంజనేయులు, శ్రీను, పద్మ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: కురుమూర్తి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సతీమణి మంజుల బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అడ్డాకుల: సంకలమద్ది, బంగ్లగడ్డ, మూసాపేట, కొమిరెడ్డిపల్లి, తాళ్లగడ్డ గ్రామాల్లో బుధవారం రాత్రి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రచారం చేశారు. ఎంపీపీ కళావతి, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్‌కు నిప్పు తప్పిన ప్రమాదం

గండేడ్: విద్యుదాఘాతంతో స్టాటర్‌కు నిప్పంటుకొని కాలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. వడ్డె గుడిసెల్లో తాగునీటి నిమిత్తం సింగిల్ ఫేజ్ బోరు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన స్టాటర్‌ను ఓ చెట్టుకు కట్టి స్థానికులు వాడుకునేవారు. బుధవారం ఉన్నట్టుండి స్టార్టర్ అంటుకుంది. పూర్తిగా కాలిపోయింది. అదే సమయంలో పశువులు నీరు తాగడానికి రావడంతో పాటు మనుషులు కూడ అక్కడే ఉన్నారు. కానీ ఎలాంటి ప్రమాదం జరగడం లేదు. ఆరు నెలల కింద కూడ ఇలాగే జరిగిందని స్థానికులు తెలిపారు. ఎన్నిసార్లు విద్యుత్ శాఖ వారికి చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: మను అధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీని తిరిగి అధికారంలోకి రాకుండా ఓడించడం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కావలి పరశురాం, కార్యదర్శి మీసాల కుర్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఛలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరించారు. దళితుల్లో చైతన్యం కల్పించడం కోసం కోటి సంతకాల సేకరణ చేపట్టి డిసెంబర్ 4న చలో ఢిల్లీకి తరలిరావాలన్నారు. బీజేపీ పెత్తందారులకు కొమ్ముకాస్తోందన్నారు. తెలంగాణలో దళితులకు మూడెకరాలు ఇవ్వడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్, వెంకట్రాములు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయలో బుధవారం రెస్యూటీం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేందర్, అమీర్‌ఖాన్, శృతి, నవాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

17న పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ సంఘం, గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో 17న ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రారంభమైన 'కార్తీక' ఉత్సవాలు



లక్ష్మీచెన్నకేశవస్వామి

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈసందర్భంగా డిసెంబర్ 12 వరకు సాయంత్రం 6గంటలకు కార్తీక దీపారాధన, 6.30గంటలకు కార్తీక పురాణ పఠనం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. అలాగే నిత్యం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈనెల 23న అఖండ విష్ణు సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, సాయంత్రం అమ్మవారికి మహిళలతో సామూహిక కుంకుమార్చన, రాత్రి 7గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఉంటాయన్నారు. 24న అఖండ విష్ణు సహస్రనామ పారాయణం పరిసమాప్తి, రాత్రి 7గంటలకు తులసి కృష్ణ వివాహం చేస్తామన్నారు. 27న కార్తీక పౌర్ణమి వేడుకలు, డిసెంబర్ 8న సామూహిక సహస్రనామార్చన జరిపిస్తామని వివరించారు. డిసెంబర్ 12న సత్యనారాయణ స్వామివ్రతం ఉంటుందని వివరించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. కార్తిక దీపారాధనలో పాల్గొనదలచిన భక్తులు సంప్రదించాలని కోరారు.

గ్యారెంటీలతో మేలు

గండేడ్/మహమ్మదాబాద్: ఎమ్మెల్యే అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి కుమార్తె మేఘనారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ మెంబర్ గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం ప్రచారం నిర్వహించారు. గ్యారెంటీలతో మేలు జరుగుతుందన్నారు. మహిళా అధ్యక్షురాలు సునీత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, కేఎం నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.